బోనాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

నేరేడ్‌మెట్, జూలై 26: వినాయకనగర్, నేరేడ్‌మెట్‌లోని అమ్మవారి ఆలయాల్లో నిర్వహించనున్న బోనాల ఉత్సవాలకు రావాలని శుక్రవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డికి సూర్యానగర్ మహంకాళి ఆలయ నిర్వాహకులు ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకారంలో భవానీ అమ్మవారు

కీసర, జూలై 26 : ఆషాఢమాసం శుక్రవారం కావడంతో కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో భవానీ అమ్మవారిని వేదపండితులు శాకంబరి అమ్మవారిగా అలంకరించారు. వివిధ రకాల పువ్వులు, కూరగాయాలు, పండ్లతో చూడముచ్చటగా అలంకరించి ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ, ఆలయ కార్యనిర్వహణాధికారి కట్టా సుధాకర్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వేదపండితులు మారుతి సత్యనారాయణశర్మ, భక్తులు పాల్గొన్నారు.

కాప్రా శానిటరీ సూపర్‌వైజర్‌గా సుదర్శన్

కాప్రా, జూలై 26 : జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ నూతన శానిటరీ సూపర్‌వైజర్‌గా సుదర్శన్ వ్యవహరించనున్నారు. ఈమేరకు శుక్రవారం సర్కిల్ డీసీ ముకుందరెడ్డికి ఆయన జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. సుదర్శన్ గతంలో కొన్నేళ్లపాటు కాప్రా సర్కిల్‌లోనే విధులు నిర్వహించి ఉప్పల్‌కు బదిలీ అయ్యారు. ఇక్కడ శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేసిన నాగరాజు తన పేరెంట్ డిపార్ట్‌మెంట్ వెళ్లారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు..

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

చర్లపల్లి, జూలై 26 : ఉద్యోగులకు పదవీ విరమణ తప్పదని, అంకితభావంతో పనిచేసే వారినే ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకుంటారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన విజయ్‌కుమార్‌ను శుక్రవారం చర్లపల్లి డివిజన్ పరిధిలోని సిరి గార్డెన్స్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు మెరుగైన విద్యను అందించిన ఉపాధ్యాయులను ఎల్లప్పుడూ గుర్తు చేసుకుంటారన్నారు. అనంతరం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ప్రధానోపాధ్యాయుడిని సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నేమూరి మహేశ్‌గౌడ్, బాల్‌నర్సింహ, పెద్ద సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన చర్లపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్‌ను సన్మానించి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

బ్రెయిన్ స్ట్రోక్ బాధితుడికి పరామర్శ

రామంతాపూర్ : బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న రామంతాపూర్ భరత్‌నగర్‌కు చెందిన స్వరూప కుమారుడు సందీప్‌ను శుక్రవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సీఎంఆర్ఎఫ్ అందించడానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే వైద్య ఖర్చులు భరిస్తానని బాధితుడికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గంధం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భరత్‌నగర్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్న సందీప్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రూ. 6.96 కోట్లతో అభివృద్ధి పనులు

- బోడుప్పల్ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం

బోడుప్పల్, జూలై 26: బోడుప్పల్ నగర పాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం కార్యాలయంలో మేయర్ తోట కూర అజయ్ యాదవ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో 15 అంశాలపై చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. వివిధ డివిజన్లలో రూ. 6.96 కోట్ల నిదులతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానించారు. అదే విధంగా చికెన్, మటన్ వ్యర్థాలను సేకరించి శాస్త్రీయ పద్ధతిలో కంపోస్టు నిర్వహించేందుకు ఏజెన్సీ నియమించడం, నగర పరిధిలో టైబజార్ రుసుమును రద్దు చేసేందుకు ఆమోదం తెలిపారు. బోనాల పండుగ సందర్భంగా వివిధ ఆలయాల వద్ద ఫ్లెక్సీల ఏర్పాటును నియంత్రించాలని పేర్కొన్నారు. బంగారు మైసమ్మ దేవాలయం వద్ద 100 మీటర్ల పరిధిలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయకూడదని, ఎవరైనా ఏర్పాటు చేస్తే వాటిని తొలగించి జరిమానా వేయనున్నట్లు కమిషనర్ రామలింగం తెలిపారు. సమావేశంలో పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మేయర్ అజయ్ యాదవ్, కమిషనర్ రామలింగం

వీధి కుక్కల బారినుంచి కాపాడండి..

- నాగారం మున్సిపల్ కమిషనర్‌కు రాంపల్లి వాసుల వినతి

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 26: వీధి కుక్కల బారి నుంచి తమను కాపాడాలని రాంపల్లి గ్రామస్తులు శుక్రవారం నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. రాంపల్లి గ్రామంలోని పలు కాలనీల్లో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉందని, పిల్లలు, పెద్దలు కుక్క కాటుకు గురవుతున్నారని కమిషనర్‌కు వివరించారు. కుక్కలను బారినుంచి తమను కాపాడాలని, వీధి కుక్కలను గ్రామం నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు.

కమిషనర్ రాజేందర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాంపల్లి గ్రామానికి చెందిన యువకులు

నాలాలో పూడిక.. కదలని మురుగునీరు

ఉప్పల్, జూలై 26 : వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ డీసిల్టింగ్ పనులు చేపట్టడంలేదని నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ అన్నారు. నాచారంలోని వీరారెడ్డికాలనీ, రాఘవేంద్రనగర్, అన్నపూర్ణకాలనీ, బాబానగర్, హనుమాన్‌నగర్, సావర్కర్‌నగర్‌ల్లో పైపులైన్లు పూర్తిగా సిల్ట్‌తో నిండిపోయాయని తెలిపారు. దీంతో వరదనీరు రోడ్లపై నిలిచిపోతుందన్నారు. ఈ విషయాన్ని ఇంజినీరింగ్ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండాపోయిందని తెలిపారు. ఇందిరానగర్‌లోని ట్రంక్‌లైన్‌లో ఇప్పటివరకు పూడికతీత పనులు చేపట్టకపోవడంతో అవస్థలు తప్పడంలేదన్నారు. సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. తక్షణమే అధికారులు పూడికతీత పనులు చేపట్టి, వరద ముంపు నుంచి కాలనీల ప్రజలను కాపాడాలని కోరారు.

నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలు

కమ్యూనిటీ భాగస్వామ్యంతోనే టీబీ నివారణ

- మేడ్చల్ జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీదేవి

కాప్రా, జూలై 26 : కమ్యూనిటీ భాగస్వామ్యంతోనే టీబీ నివారణ సాధ్యమని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీదేవి అన్నారు. ఎన్‌టీఈపీ, టీబీ అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం చర్లపల్లి ప్రాంతంలోని పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులు, కార్మికులు, కాప్రా సర్కిల్‌లోని మహిళాసంఘాల ప్రతినిధులకు క్షయను గుర్తించే తీరుపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. శిక్షణ పొందినవారు తాము పనిచేసే ప్రదేశాల్లో, నివాస ప్రాంతాల్లో, బంధువుల్లో ఎవరికైనా క్షయవ్యాధి లక్షణాలు ఉంటే తగిన సలహాలు, సూచనలు ఇచ్చి దగ్గరలోని ప్రభుత్వ దవాఖానల్లో చూపించుకునేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టీఈపీ, టీబీ అలర్ట్ ఇండియా ప్రతినిధులు పురుషోత్తం, రాజు పటేల్, కిశోర్, జ్యోతి, క్రిస్టోఫర్ పాల్గొన్నారు.

పరిశ్రమల ఉద్యోగులకు టీబీ నియంత్రణపై నిర్వహించిన ఒక రోజు శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న నిర్వాహకులు

పనుల్లో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్

మల్లాపూర్, జూలై 26 : కమ్యూనిటీ హాళ్ల ఏర్పాటుతో స్థానికులు చిన్న చిన్న ఫంక్షన్లు జరుపుకునేందుకు వీలుగా ఉంటుందని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఇంజినీరింగ్ అధికారులతో కలిసి మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సదరు కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ రూప, ఏఈ స్రవంతి, కాలనీ వాసులు మల్కయ్య, వెంకట్‌రెడ్డి, రాజు, వీఎస్ఎన్ రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రవీణ్, మల్లేశ్, మెండ రఘు, తదితరులు పాల్గొన్నారు.

గోకుల్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి, అధికారులు

విద్యార్థుల్లో సామర్థ్యాలను మెరుగుపర్చాలి : డీఈవో

మేడ్చల్, జూలై 26 : విద్యార్థుల్లో సామర్థ్యాలను మెరుగపరిచేందుకు రిసోర్స్ పర్సన్లు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి సూచించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకు ఆర్పీలకు శుక్రవారం శిక్షణఇచ్చారు. ఈ సందర్భంగా డీఈవో పాల్గొని మాట్లాడుతూ 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించే పరీక్షల్లో వారి ప్రదర్శన అత్యుత్తమంగా ఉండాలని, జిల్లాను రాష్ట్రంలోనే ఉన్నత స్థానంలో నిలపాలని సూచించారు. ప్రధానంగా 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉండాల్సిన సామర్థ్యాలను పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధతో బోధన అభ్యసన నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రవీందర్‌రాజు, డీసీఈబీ కార్యదర్శి సురేశ్, కూకట్‌పల్లి హెచ్ఎం నరేందర్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా స్థాయి, కాంప్లెక్స్ స్థాయి రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ప్రజలంతా పరిశుభ్రతను పాటించాలి

జవహర్‌నగర్, జులై 26: పరిశుభ్రతను మెరుగుపరిచి, ప్రజలకు ఆరోగ్య రక్షణ కల్పిద్దామని జవహర్‌నగర్ మేయర్ శాంతి మున్సిపల్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో 'డ్రై డే-డ్రై డే' కార్యక్రమాన్ని మేయర్ శాంతి ప్రారంభించి మాట్లాడారు. దోమలు వ్యాప్తి చెందే ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, పాతటైర్లు, డబ్బాలలో నీటిని పారపోయాలని ప్రజలకు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, డాక్టర్ హరిత, ఆరోగ్య విస్తరణ అధికారి షౌకత్‌అలీ, ఆశ కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు కాల్వలను శుద్ధి చేయాలని సిబ్బందికి సూచిస్తున్న జవహర్‌నగర్ మేయర్ శాంతి

విద్యార్థులకు మెదడువాపు వ్యాధి నిరోధక టీకా

మల్కాజిగిరి, జూలై 26: విద్యార్థులకు మెదడువాపు వ్యాధి రాకుండా వ్యాక్సినేషన్ చేస్తున్నామని మచ్చబొల్లారం యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసన్ డాక్టర్ శృతి అన్నారు. శుక్రవారం అల్వాల్, మల్కాజిగిరి సర్కిల్స్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెదడువాపు వ్యాధి నిరోధక టీకాను ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ దోమకాటు వలన మెదడువాపు వ్యాధి వస్తుందని, ఇది ప్రాణంతకమైనదని అన్నారు. వ్యాధి రాకుండా ముందస్తుగా పదిహేను సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాక్సినేషన్ ఇస్తున్నామని, తల్లిదండ్రులు వైద్య సిబ్బందికి సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు అన్నపూర్ణ, సంపూర్ణ, మంజుల, అంగన్‌వాడి టీచర్లు పద్మ, సంధ్య, విజయలక్ష్మి, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ కార్ఖానా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వ్యాక్సినేషన్ వేస్తున్న వైద్యసిబ్బంది

విద్యార్థులు సోదర భావంతో మెలగాలి

సదస్సులో మాట్లాడుతున్న జిల్లా లీగల్ సెల్ ప్రతినిధులు రాకేశ్, రమాకాంత్

నేరేడ్‌మెట్, జూలై 26: విద్యార్థులు సోదర భావంతో మెలగాలని మేడ్చల్ జిల్లా లీగల్ సెల్ ప్రతినిధులు రాకేశ్, రమాకాంత్ అన్నారు. శుక్రవారం వాజ్‌పెయినగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా విభాగం ఆధ్వర్యంలో న్యాయ సేవాధికార అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలల్లో ర్యాగింగ్ నిషేధమని, ర్యాగింగ్ పాల్పడిన వారికి చట్టరీత్యా శిక్ష పడుతుందని పేర్కొన్నారు. అనంతరం వివిధ సెక్షన్ల గురించి విద్యార్థులను అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శైలజ, జాతీయ సేవా విభాగం అధికారులు డాక్టర్ రమేశ్, జీఎన్ జగన్, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి సామగ్రి అందజేత

శామీర్‌పేట, జులై 26 : మండలంలోని ఆలియాబాద్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి డాట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామగ్రిని అందజేశారు. శుక్రవారం కంపెనీ ప్రతినిధులు మాజీ సర్పంచ్ గుర్క కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో సోలార్ పవర్‌ప్లాంట్, వీల్‌చైర్‌లు, ఫర్నిచర్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణారెడ్డి, మాజీ వార్డు సభ్యులు రాంరెడ్డి, ఈశ్వర్ పాల్గొన్నారు.

బోనాల ఉత్సవం.. విద్యార్థుల సందడి

ఉప్పల్, జూలై 26 : నాచారం, హబ్సిగూడలోని బచ్‌పన్ పాఠశాలల్లో బోనాల ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో బోనాలు ఎత్తుకొని ఆటపాటలతో సందడి చేశారు. చిన్నారులు పోతరాజుల విన్యాసాలు, అమ్మవారి వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ చిలక శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యార్థిదశ నుంచే మన సంప్రదాయాలను, కళలను తెలియజేసేలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కల్పన, నాచారం ప్రధానోపాధ్యాయులు డి.సరిత, హబ్సిగూడ ప్రధానోపాధ్యాయులు సంధ్య, కోఆర్డినేటర్ లక్ష్మేశ్వరి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బచ్‌పన్ పాఠశాలలో బోనాల ఉత్సవంలో పాల్గొన్న విద్యార్థినులు

ఆస్తిపత్రాలు తీసుకెళ్లారని పోలీసులకు ఫిర్యాదు

ఘట్‌కేసర్,జూలై 26 : ఘట్‌కేసర్‌లో ఇటీవల హత్యకు గురైన గడ్డం మహేశ్ ఆస్తి పత్రాలను బంధువులు ఇవ్వడం లేదని మహేశ్ కూతురు తరుణి శుక్రవారం ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహేశ్ ఇంట్లోని అల్మారా తెరిచి ఆయన తమ్ముడు విఠల్, అక్కాచెల్లెళ్లు ఆస్తి పత్రాలు, బంగారం, డబ్బులతోపాటు బుల్లెట్ బైక్ తీసుకుపోయారని తరుణి తన ఫిర్యాదులో పేర్కొంది. ఈమేరకు ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి అదృశ్యం

ఘట్‌కేసర్, జూలై 26 : ఘట్‌కేసర్ బాలాజీనగర్‌లో స్నేహితులతో కలిసి ఉంటున్న పి.వెంకట్ రెడ్డి(19) అనే ఇంజినీరింగ్ విద్యార్థి ఈనెల 25 నుంచి కనిపించడం లేదు. వెంకట్‌రెడ్డి కొండాపూర్ సమీపంలోని హోళీమేరి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ విషయమై విద్యార్థి మామ మనోహర్‌రెడ్డి ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

వెంకట్‌రెడ్డి(ఫైల్)

యువత క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలి

జవహర్‌నగర్,జూలై 26: యువత క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని వెల్‌నెస్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం వెల్‌నెస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సిబ్బందికి క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆటలాడి ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. వెల్‌నెస్ హాస్పిటల్ యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించి ఉత్సాహపరచడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం గెలుపు పొందిన జట్టుకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏజీఎం మహేశ్, యువకులు, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

కార్గిల్ అమర జవాన్లకు ఘన నివాళి

- అంతటా విజయ్ దివస్
- నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ఉప్పల్, జూలై 26 : కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని హబ్సిగూడలో శుక్రవారం అమర జవాన్లకు బీజేపీ నేతలు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతనహరిశ్ పాల్గొని కార్గిల్ యుద్ధంలో మృతి చెందిన వీర జవాన్ల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో చంద్రమౌళి, బద్దం భాస్కర్‌రెడ్డి, కే. రవీందర్‌రెడ్డి, బీ. రవీందర్‌రెడ్డి, ఫణీందర్, సురేఖ, శైలేష్‌రెడ్డి, అరవింద్, ప్రవీణ్,ఎల్లాచారి, నరేశ్, శివ, సందీప్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ చేతన

బొల్లారంలో...

మల్కాజిగిరి : కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌తో పోరాడి వీరమరణం పొందిన సైనికులు చిరస్మరణీయులని పలువురు నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం బొల్లారంలో కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన వై. రామచంద్ర విగ్రహానికి ఆయన భార్య ఎంఆర్ దివ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటేశ్, మల్లికార్జున్ యాదవ్, ఆనంద్, అజిత్, సాయి, జస్వంత్ యాదవ్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఆర్కేపురం వైట్‌హౌస్‌లో..

నేరేడ్‌మెట్ : మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్కేపురం వైట్‌హౌస్‌లో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్గిల్ యుద్ధంలో ఎంతో మంది జవాన్లు వీరమరణం పొందారన్నారు. ప్రతి ఒక్కరూ అమర జవాన్లను స్మరించుకోవాలన్నారు. మాజీ సైనికుల సంక్షేమం కోసం కృషి చేస్తానన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర కన్వీనర్, మాజీ సైనికుడు గోపు రమణారెడ్డి పాల్గొని మాట్లాడారు.

బొల్లారంలోని వై రామచంద్ర విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆయన భార్య ఎంఆర్ దివ్య

వైట్‌హౌస్‌లో విజయ్ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రవణ్, తదితరులు

13 కిలోల గంజాయి పట్టివేత.. నలుగురు అరెస్ట్

మేడ్చల్, జులై 26 : సమాజ పురోభివృద్ధికి పాటుపడాల్సిన యువకులు పెడదోవపడుతున్నారు.. మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు.. మరికొందరు జల్సాలకు అవసరమైన డబ్బును సమకూర్చుకోవడానికి వినియోగించుకుంటున్నారు. శుక్రవారం మేడ్చల్‌లో గంజాయి పట్టివేత ఘటనలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.. ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపిన వివరాల ప్రకారం..

గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో మేడ్చల్ పారిశ్రామికవాడ చెక్ పోస్ట్ వద్ద శుక్రవారం ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వెంకటాపూర్‌కు చెందిన సుతారి గుణశేఖర్(22), అదే జిల్లాలోని చిన్నమునగాల మండలం కొణిజెర్లకు చెందిన చల్లమల్లి శరత్(23) 8.6 కిలోల ఎండు గంజాయిని ఆహార పదార్థాలను డెలివరీ చేసే స్విగ్గీ బ్యాగులో తరలిస్తున్నట్టు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. గంజాయి రవాణా, విక్రయంలో మరో ఇద్దరు వ్యక్తులు ఉన్నట్టు తేలింది. వారిలో నల్గొండ జిల్లా బోయగూడకు చెందిన అవిశెట్టి అభిరామ్(21), అదే జిల్లా చౌటుప్పల్ మండలం లింగోజిగూడేనికి చెందిన ఆదిత్యవర్ధన్(22)తో కలిసి గుణశేఖర్, శరత్ సీలేరు నుంచి అద్దె వాహనంలో 40 కిలోల గంజాయిని కరీంనగర్ జిల్లా వేములవాడలో కబాబ్ సెంటర్ నిర్వహించే కట్టికోల వినయ్(24) వద్ద నిల్వ చేశారు. అక్కడి నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులతోపాటు ఇతరులకు విక్రయిస్తున్నారు.

అనంతరం ఎక్సైజ్ అధికారులు వినయ్, ఆదిత్యవర్ధన్‌లను అదుపులోకి తీసుకున్నారు. అభిరామ్ పరారీలో ఉన్నాడు. వారి వద్ద నుంచి మరో 4.4 కిలోల గంజాయిని, రెండు సెల్‌ఫోన్‌లు, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితుల నుంచి రూ.13 లక్షల విలువైన 13 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న సీఐ నవనీత తెలిపారు.

అదేవిధంగా రెండు రోజుల క్రితం గుండ్ల పోచంపల్లిలోని మహంకాళి కాలనీలో 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని, కార్తిక్, అరుణ్‌బాబు, కమల్‌సు రిమాండ్‌కు తరలించామని తెలిపారు. యువత గంజాయి మత్తుకు అలవాటు పడి భవిష్యత్‌ను అంధకారం చేసుకోవచ్చని, లక్ష్యాన్ని ఏర్పరచుకుని ముందుకు సాగాలని ఆమె సూచించారు.

పట్టుకున్న యువకులు, స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

గంగాభవానీ అమ్మవారి ద్వాదశ వార్షికోత్సవాలు

గంగమ్మ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న గంగపుత్ర సంఘం ప్రతినిధులు

రామంతాపూర్, జూలై 26 : గంగపుత్రులు కుల దేవమైన గంగాభవానీ అమ్మవారి ద్వాదశ వార్షికోత్సవాలు శుక్రవారం రామంతాపూర్ చిన్న చెరువులో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ధ్వజారోహణం, పంచామృత స్నపనం, తిరుమంజనం, చండీ సప్తశతీ హోమం నిర్వహించారు. అనంతరం భక్తుల సమక్షంలో అమ్మవారి శాంతి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులకు అన్నదానం చేశారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడు ధీటి మల్లయ్య, ఆలయ అధ్యక్షుడు పూస సత్తయ్య మాట్లాడుతూ ఈనెల 28న అమ్మవారి బోనాల పండుగను ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు తవిడబోయిన గిరిబాబు, సభ్యులు వెంపటి శ్రీనివాస్, కాపర్తి మోహనకృష్ణ, రచ్చ మహేశ్, బ్రహ్మానందగిరి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మార్షల్ ఆర్ట్స్‌తో.. మానసిక ప్రశాంతత

పతకాలు సాధించిన విద్యార్థులతో తైక్వాండో అకాడమీ మాస్టర్ రమేశ్

జవహర్‌నగర్, జూలై 26: మార